క్లుప్తంగా

కలిగిరమ్మ గ్రామోత్సవం



కలిగిరి: కలిగిరి గ్రామదేవత కలిగిరమ్మ తిరునాళ్లలో భాగంగా రెండోరోజు సోమవారం రాత్రి అమ్మవారి పుట్టినిల్లు అయిన పాపనముసిలిపాళెంలో అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కలిగిరమ్మ ఆలయం వద్ద కొత్తూరులోని కోదండరామస్వామి ఆలయ నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

సీతారామపురం : మండలంలోని బెడుసుపల్లి, నాగరాజుపల్లి, గంగవరం అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను సోమవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి అంగన్‌వాడీలకు సూచనలు చేశారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

మర్రిపాడు: మండలంలో పాఠశాలల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదును సోమవారం చేపట్టారు. యూటీఎఫ్ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ ,జిల్లా కార్యదర్శి మోహన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీగా కన్వీనర్‌గా అవినాష్‌రెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కన్వీనర్‌గా బీ అవినాష్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఏబీవీపీ జిల్లా బాధ్యుడు గంగాధర్ సోమవారం తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



క్షతగాత్రులు బత్తుల గంగమ్మ, శేఖర్, జ్యోతి

సీతారామపురం : మండలంలోని గంధంవారిపల్లి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. మండలంలోని సంజీవరెడ్డినగర్ గ్రామానికి చెందిన శేఖర్, బత్తుల గంగమ్మ, దేవండ్ల జ్యోతి మోటార్‌సైకిల్‌పై ప్రకాశం జిల్లా దర్శిగుంటపేటకు వెళ్లి తిరిగి వస్తున్నారు. గంధంవారిపల్లి గ్రామంలోకి వెళ్లేందుకు హైవేను క్రాస్‌చేస్తూ అదుపుతప్పి ట్రాక్టర్ ట్రాలీని ఢీకొన్నారు. ఈ ఘటనలో మోటార్‌సైకిల్‌పై ఉన్న ముగ్గురు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108లో ఉదయగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

3న బైక్‌ల వేలం

కావలి (జలదంకి): కావలి ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో జూలై 3న వివిధ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలను బహిరంగ వేలం వేయనున్నట్లు కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వాహన ధరలో 10 శాతం నగదును ముందుగా చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

గురువులు సమాజ నిర్దేశకులు

• మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సోమశిల: గురువులు సమాజ నిర్దేశకులని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. అనంతసాగరంలోని టీజేఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయుడు మెట్టుకూరు సుబ్బారెడ్డి ఉద్యోగ విరమణ సభను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విక్రమ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. మెట్టప్రాంతంలో విద్యాభివృద్ధికి తమ కుటుంబం ఎంతో కృషి చేసిందని గుర్తుచేశారు. ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి తాము ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా ఇప్పటికే పలు పాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌రూములు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇంకా పలు పాఠశాలల్లో త్వరలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను కల్పించి వారి భవిష్యత్తుకు బంగారుబాట వేసేందుకు అందరం సమష్టిగా కృషి చేద్దామన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర ఎనలేనిదన్నారు. ఉపాధ్యాయుడిగా సుదీర్ఘకాలం పనిచేసిన సుబ్బారెడ్డి క్రమశిక్షణకు కట్టుబడి, సమయపాలన పాటించి ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. అనంతరం మెట్టుకూరు సుబ్బారెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. ఎంపీపీలు సంపూర్ణమ్మ, పద్మజ, శ్రీనివాసులునాయుడు, రవీంద్రరెడ్డి, డాక్టర్ ప్రణీత్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బిజివేముల పిచ్చిరెడ్డి, ప్రముఖ కాంట్రాక్టర్ ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ శోభ, నాయకులు బల్రెడ్డి జనార్దన్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, అంబటి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మెట్టుకూరును సత్కరిస్తున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

వైఎస్ జగన్ పర్యటనను జయప్రదం చేయాలి

చిట్రగుంట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు కోరారు. బోగోలులోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి గొంతు నొక్కేందుకు అక్రమ కేసులు బనాయించి జైలులో పెట్టారన్నారు. ఒక కేసులో బెయిల్ వస్తే, మరో కేసు పెడుతూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జైలులో ఉన్న కాకాణిని ములాఖత్ ద్వారా పరామర్శించేందుకు ఈ నెల 3న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరుకు వస్తున్నారని తెలిపారు. జగన్ పర్యటనను, జనప్రభంజనాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతుందన్నారు. ఇప్పటికే హెలీప్యాడ్‌లకు అనుమతులు ఇవ్వకుండా అడ్డంకులు సృష్టిస్తుందని విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా జగన్ పర్యటనను విజయవంతం చేసేలా ప్రతికార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మద్దిబోయిన వీరరఘు

డీఎస్సార్ ట్రస్టు సేవలు అభినందనీయం

అల్లూరు: దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ కొనియాడారు. మండలంలోని ఇందుపూరు కాలువ వద్ద ఉన్న దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ట్రస్ట్‌లోని హైస్కూల్, ఆస్పత్రి, స్కిల్‌డెవలప్ మెంట్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ ట్రస్టు నిర్వాహకులు దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి విద్య, వైద్యాన్ని పేదలకు చేరువ చేయడంలో విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ట్రస్టులో విద్యార్థులకు అత్యాధునిక వసతులతో ఉచిత విద్యను అందిస్తున్నారని కితాబునిచ్చారు. ఇదే తరహాలో నెల్లూరు నగరంలోని 54 మున్సిపల్ పాఠశాలలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో డీఎస్సార్ ట్రస్టును సందర్శించినట్లు తెలిపారు. నెల్లూరు నగరంలోని మూలాపేట బాలికల ఉన్నత పాఠశాల అభివృద్ధికి దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి ముందుకు రావడం అభినందనీయమన్నారు. మూలాపేట హైస్కూల్‌లో 14 తరగతి గదులు, ఇతర నిర్మాణాలను డిసెంబర్‌లోగా పూర్తి చేస్తామన్నారు.ట్రస్ట్ అధినేత దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి, ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి, మేనేజర్ అనిల్‌రెడ్డి, పెన్నాడెల్టా వైస్‌చైర్మన్ బీద గిరిధర్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, కావలి రూరల్ సీఐ పాపారావ్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నీటికుంటలో జారిపడి మహిళ మృతి

మర్రిపాడు: ఇంట్లోని నీటికుంటలో జారిపడి ఊపిరిఆడక మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని పొంగూరు బీసీ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. పొంగూరు గ్రామానికి చెందిన సునీత(37) భర్త చనిపోగా తన ఇద్దరు పిల్లలతో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. రోజులాగే పనికి వెళ్లి వచ్చిన ఆమె ఇంటి సమీపంలోని నీటికుంట వద్ద ముఖం శుభ్రం చేసుకుంటుండగా కాలుజారి అందులో పడిపోయింది. నీటికుంట ఆరు అడుగుల లోతు, ఇరుకుగా ఉండడంతో ఊపిరిఆడక మృతి చెందింది. కాగా తండ్రికి తోడు తల్లి కూడా దూరం కావడంతో పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

విద్యతో ఉన్నత శిఖరాలు



చుంచులూరులో విద్యార్థులకు సత్కారం



జలదంకిలో విద్యార్థులకు పురస్కారాల ప్రదానం

మర్రిపాడు: విద్యతో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని, దాతలు అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలను చేరుకోవాలని హెచ్‌ఎం విజయభాస్కర్ అన్నారు. చుంచులూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను సోమవారం పంపిణీ చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రవాస భారతీయుడు సుదర్శన్‌రెడ్డి సహకారంతో మొదటి ఐదు స్థానాలు సాధించిన విద్యార్థులు లహరి, సమీరా, చరణ్, కీర్తి, శృతికి వరుసగా రూ.8వేలు, రూ.7వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.4వేలు చొప్పున నగదును అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి బుగాట్టి షూ కంపెనీలో ప్రొడెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న దువ్వూరు సురేష్‌కుమార్ విద్యార్థులకు రుచికరమైన విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. విశ్రాంత ఎంఈఓ జొన్నా సత్యనారాయణ, మాజీ సర్పంచ్ దువ్వూరు జయదేవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జలదంకి: జలదంకి ఉన్నత పాఠశాలలో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నగదు బహుమతులను సోమవారం అందజేశారు. పూర్వ విద్యార్థుల సంఘం గౌరవాధ్యక్షుడు మద్దుల వెంకట నరసింహం తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా నగదు బహుమతులను అందజేసినట్లు పూర్వ విద్యార్థుల సంఘం గౌరవాధ్యక్షుడు కోర్నిపాటి హరినారపరెడ్డి తెలిపారు. ద్రోణాదుల వైష్ణవి (572)కి ప్రథమ బహుమతి రూ.15 వేలు, లక్ష్మీ ప్రత్యూష (552)కు ద్వితీయ బహుమతి రూ.10 వేలు, సింధు (549)కు తృతీయ బహుమతి రూ.5 వేలు నగదును అందజేశారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు వేలమూరి కృష్ణారెడ్డిని సత్కరించారు. పూర్వ విద్యార్థుల సంఘం ట్రెజరర్ సురె వెంకటశేషారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి యూరియా పంపిణీ

జలదంకి: మండలంలోని రైతులకు మంగళవారం నుంచి యూరియాను పంపిణీ చేయనున్నట్లు ఏఓ శ్రీవాణి సోమవారం తెలిపారు. సొసైటీ తరుపున 18 టన్నుల యూరియా మండలానికి వచ్చిందని తెలిపారు. యూరియా కావాల్సిన రైతులు అడంగల్, వన్ బీ, ఆధార్‌తో జలదంకిలోని రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

రెడ్‌క్రాస్ సాంస్కృతిక పోటీలు ప్రారంభం



కావలి (జలదంకి): ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను రెడ్‌క్రాస్ భవనంలో కావలి రెడ్‌క్రాస్ పోషక సభ్యుడు మన్నెమాల గోవిందరెడ్డి, పారిశ్రామికవేత్త పణికుమార్, గాయకులు రామచంద్రరావు, తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి సోమవారం ప్రారంభించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తదానంపై అవగాహన పెంచేందుకు ఈ నెల 5వ తేదీ వరకు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా తొలిరోజు లలిత గీతాల పోటీలు నిర్వహించారు. రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ కే హరినారపరెడ్డి, కోశాధికారి మధుసూదన్‌రావు, పాలకమండలి సభ్యులు వెంకటేశ్వర్లు, ప్రసన్నకుమార్, తలసేమియా ఆస్పత్రి సభ్యుడు కల్లయ్య, జేవీవీ అధ్యక్ష, కార్యదర్శులు తోట వెంకటేశ్వర్లు, హరనాథ్ పాల్గొన్నారు.

మల్లెం కొండేశ్వరస్వామి దర్శనానికి వెళ్లి..

• ఇద్దరు వృద్ధులు అదృశ్యం



అదృశ్యమైన వృద్ధులు

సోమశిల: వెలిగొండ అటవీ ప్రాంతంలోని మల్లెంకొండేశ్వరస్వామి దర్శనానికి వెళ్లిన ఇద్దరు వృద్ధులు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మనుబోలు మండలం నాయుడుపల్లికి చెందిన కోటపాటి రత్నయ్య, కోటపాటి సుబ్బయ్యనాయుడు అన్నదమ్ములు. వారు జూన్ 25వ తేదీ వైఎస్సార్ జిల్లా పరిధిలోని మెట్ల మార్గం ద్వారా మల్లెం కొండేశ్వరస్వామి ఆలయానికి వెళ్లారు. జూన్ 26న మెట్లు దిగి కిందకు రావాల్సిన వారు రాలేదు. వృద్ధుల కుమారులు సుబ్రహ్మణ్యం, నాగేశ్వరావు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం సోమశిల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కలిసి మల్లెంకొండ అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టినా వారి ఆచూకీ లభించలేదు. కాగా వృద్ధుల ఆచూకీ తెలిపిన వారికి రూ.10వేలు నగదు పారితోషికం అందజేస్తామని సోమశిల ఎస్సై అనూష తెలిపారు.

సూర్యప్రకాష్‌రావు సేవలు ఎనలేనివి



మర్రిపాడు: ఆంగ్ల ఉపాధ్యాయుడిగా మహిమలూరు సూర్యప్రకాష్‌రావు అందించిన సేవలు ఎనలేనివని టీఎన్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ కొనియాడారు. టీఎన్‌పేట ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన మహిమలూరు సూర్య ప్రకాష్‌రావు దంపతులను సహచర ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సన్మానించారు. విశ్రాంత ఎంఈఓ జొన్నా సత్యనారాయణ, ఎమ్మార్పీ రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్లకు సన్మానం



ఉదయగిరి: ఉదయగిరి ఆర్టీసీ డిపోలో కండక్టర్లుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన నాగేశ్వరరావు, వీ కోటేశ్వరరావు, వీ కృష్ణప్రభాకర్‌ను సహచర ఉద్యోగులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఆర్టీసీ ఉద్యోగులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంఓగా ఉషాసుందరి సేవలు మరువలేని



ఉషాసుందరి దంపతులకు సత్కారం


ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఆర్‌ఎంఓ డాక్టర్ ఉషాసుందరి ఉద్యోగ విరమణ సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ శేషారత్నం మాట్లాడుతూ డాక్టర్‌గా ఉషాసుందరి అందించిన సేవలను కొనియాడారు. ఆమె శేష జీవితం సుఖంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం ఉషాసుందరి దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఆత్మకూరు విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న శివప్రసాద్ ఉద్యోగ విరమణ పొందడంతో ఏడీఈతో పాటు ఏఈలు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. అలాగే ఆత్మకూరు రహదారులు భవనాల శాఖలో గ్యాంగ్ మజ్దూర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కంచర్ల రమణయ్యను ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

కౌలురైతులకు పంటసాగు హక్కు పత్రాలు

అనుమసముద్రంపేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలను పొందేందుకు అవసరమైన పంట సాగు హక్కు పత్రాల కోసం కౌలురైతులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కే అనిల్‌కుమార్, ఏఓ ఎం సురేష్‌బాబు సోమవారం తెలిపారు. ఇందుకోసం వీఆర్వోను సంప్రదించాలని సూచించారు.

విద్యాసామగ్రి వితరణ

కావలి (జలదంకి): కావలిలోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని సోమవారం పంపిణీ చేశారు. రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజనులు పిల్లలను బాగా చదివించాలన్నారు. రామ్ సెంటర్ డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి పాల్గొన్నారు.



డీసీపల్లిలో 598 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 598 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 773 బేళ్లు రాగా, 598 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.160, సగటున రూ.210.51 ధర పలికిందని వివరించారు.

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 263 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వాహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 423 బేళ్లను తీసుకురాగా, 263 బేళ్లను విక్రయించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.160, సరాసరిన రూ.215.29 ధర పలికిందని వివరించారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షురాలిగా నాగూర్‌బీ



ఉదయగిరి రూరల్: మండల పంచాయతీ కార్యదర్శుల సంఘ ఎన్నిక ఉదయగిరిలోని స్త్రీశక్తి భవనంలో సోమవారం జరిగింది. మండలాధ్యక్షురాలిగా అగ్నిగుండాల నాగూర్‌బీ, ఉపాధ్యక్షుడిగా బసిరెడ్డి చంద్రశేఖరయ్య, కార్యదర్శిగా నల్లిపోగు చిన్నబాబు, కోశాధికారులుగా ఆవుల వెంకటరమణయ్య, షేక్ మహబూబ్‌బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో విద్యార్థుల సత్తా



కలిగిరి: స్థానిక బొమ్మరాజుచెరువులోని ఈస్ట్‌వుడ్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తాచాటారని ప్రిన్సిపల్ యామినీదేవి సోమవారం తెలిపారు. కావలిలోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి హాండ్‌బాల్ పోటీల్లో రాణించి ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులతో పాటు పీఈటీ హుస్సేన్‌ను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలి



ఆత్మకూరురూరల్: ప్రభుత్వం తక్షణమే స్పందించి రెండో పంట సాగుచేస్తున్న రైతులకు యూరియాను అందుబాటులో ఉంచాలని రైతు సంఘాల నాయకులు గంటా లక్ష్మీపతి, లక్కు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు సంఘాల నాయకులు ఆత్మకూరు తహసీల్దార్ పద్మజాకుమారికి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం వినతి పత్రం అందజేశారు. సోమశిల జలాశయం కింద లక్ష ఎకరాల్లో రెండో పంట సాగు చేస్తున్నారని తెలిపారు. మూడు లక్షల యూరియా బస్తాలు అవసరం కాగా, వ్యవసాయ శాఖ కేవలం 22వేల బస్తాలు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు చెబుతుండడం హాస్యాస్పదమన్నారు. నాయకులు శ్రీనివాసులురెడ్డి, పెంచలయ్య, హజరత్తమ్మ, వెంకటేశ్వర్లు, తోడేటి పుల్లయ్య పాల్గొన్నారు.


ఉపాధ్యాయులకు సన్మానం



ప్రభావతి దంపతులకు సత్కారం

ఆత్మకూరురూరల్: మండలంలోని మురగళ్ల, నల్లపరెడ్డిపల్లి, మహిమలూరు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులను సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు.

ఆర్టీసీ ఏడీసీకి సత్కారం



కావలి (జలదంకి) : కావలి ఆర్టీసీ డిపోలో ఏడీసీగా విధులు నిర్వహిస్తున్న కొమారి వెంకట్రావు ఉద్యోగ విరమణ సభను తుమ్మలపెంటలో సోమవారం నిర్వహించారు. కావలి డిపో అసిస్టెంట్ మేనేజర్ కల్పనారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వెంకట్రావు సేవలను కొనియాడారు. అనంతరం వెంకట్రావు దంపతులను ఆర్టీసీ సిబ్బంది, మిత్రులు ఘనంగా సన్మానించారు. ఆర్టీసీ సిస్టం సూపర్‌వైజర్ శివశంకర్, బంధువులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఆందోళన

ఉదయగిరి: మండలంలోని పుల్లాయపల్లెకు చెందిన ఉపాధి కూలీలు మస్టర్లు గల్లంతు చేస్తుండడంతో వేతనాలు సరిగా అందడం లేదని మండల పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ అప్పాజీకి వినతిపత్రం అందజేశారు.

వ్యవసాయ రుణాలకు ప్రాధాన్యం

కలిగిరి: రైతులకు వ్యసాయ రుణాలు ఇవ్వడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కెనరా బ్యాంక్ తిరుపతి సర్కిల్ జనరల్ మేనేజర్ పాండురంగ మిత్తాన్తయ తెలిపారు. కలిగిరిలోని ఆధునీకరించిన కెనరా బ్యాంక్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. నెల్లూరు రీజనల్ ఏజీఎం అదారి నాగరాజు , బ్యాంక్ మేనేజర్ వెంగళరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలను ఏర్పాటు చేయాలి

కావలి(జలదంకి): కావలి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని బీసీ ఐక్యత భవన్ రాష్ట్రాధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్, గౌరవాధ్యక్షుడు ఉరిటి గోవిందు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నివరప్రసాదరావు కావలి ఆర్డీఓ వంశీకృష్ణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేకపోవడంతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని విన్నవించారు.













